

కాల్వలు, చెరువు గట్లపై ఆక్రమణలు తొలగించాలి : జెసి

భీమవరం : జిల్లాలో కాలువలు, చెరువుగట్లపై ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించిన వాచ్ డాగ్ కమిటీ సమీక్ష సమావేశంలో జెసి మాట్లాడారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ పరిధిలో జలాశయాలు, జల వనరులు ఆక్రమణలను గుర్తించి తొలగించే కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా 361.86 ఎకరాలు ఆక్రమణలపై ఆయన సమీక్షించారు. మండలాల వారీగా ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఎన్ని ఎకరాలు ఆక్రమణలలో ఉన్నది, ఏమేరకు తొలగింపు కార్యక్రమం చేపట్టారని ఆరా తీశారు. మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి బుధవారం సమావేశమై ఆక్రమణల తొలగింపు విషయంపై చర్చించాలని, తాత్కాలికమైన ఆక్రమణలను తక్షణమే తొలగించాలన్నారు. ఆక్రమణ ప్రాంతంలో పట్టాలు మంజూరై శాశ్వత కట్టడాలు ఉన్న వాటి వివరాలను ఒక నివేదిక అందజేయాలన్నారు. ఆర్డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ఉధృతంగా వశిష్ట గోదావరి

నీట మునిగిన లంక భూములు - బిక్కుబిక్కుమంటున్న లంక గ్రామాల ప్రజలు



పెదమల్లం పర్యాటక కేంద్రాన్ని చుట్టుముట్టిన వరద నీరు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి శుక్రవారం మరింత ఉధృతంగా మారింది. ధవళేశ్వరం నుంచి పెద్ద ఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండడంతో వశిష్ట గోదావరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మండలంలో పుచ్చలంక, నకిడిలంక, రాయి లంకలు ముంపుబారిన పడ్డాయి. అయోధ్యలంకలో పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుకుంటోంది. అయోధ్యలంకలో ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. పుచ్చలంక వాసులు పడవలపైనే ప్రయాణిస్తున్నారు. లంక వాసులకు రాకపోకలు నిలిచిపోవడంతో వారు నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి సైతం వారికి అవస్థలు తప్పడం లేదు. నీటి ప్రవాహం ఉధృతంగా మారడంతో నదిలో నాటు పడవల రాకపోకలపై అధికారులు నిషేధం విధించారు. ఎస్కె.వెంకటరమణ ఆధ్వర్యంలో లంక గ్రామాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ జి.కనకరాజు, రెవెన్యూ అధికారులు లంక గ్రామాల్లో సంచరిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్, విఆర్లను అప్రమత్తం చేశారు.

నీట మునిగిన పంటలు..

లంక భూముల్లోకి వరద నీరు చేరుతుండడంతో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ప్రధానంగా తమలపాకు పండించిన రైతులకు తీవ్ర నష్టాలు తప్పడం లేదు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టామని రైతులు వాపోతున్నారు. ఇక పచ్చిమిర్చి, అరటి, దొండ, బీర, ఆనబ, మునగ, చిక్కుడు, ఇతర కూరగాయల తోటలు కూడా నీట మునిగాయి.



కనకాయలంకలో స్థానికులతో కలిసి వరద నీటిలో నడిచి వెళుతున్న తహశీల్దార్ పవన్ కుమార్

రైతులు సురక్షిత ప్రాంతాలకు పశువులను తరలిస్తున్నారు. పశువుల పాకలు, పచ్చిక మేత మునగడంతో పశువుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. పెద్దమల్లంలోని శ్రీమాసేనమ్మ అమ్మవారి ప్రాంగణం, పర్యాటక కేంద్రాన్ని వరద నీరు తాకింది. భీములాపురంలోని ఏటిగట్టు దిగువున ఉన్న కాపులపాలెంలోకి వరద నీరు ఏ క్షణాన్నైనా చుట్టుముట్టే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి..

వరద ఉధతి మరింత పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు కోరుతున్నారు. గ్రామస్తులు ఎత్తైన ప్రాంతాలతో పాటు పక్కన ఉన్న ఇళ్లపైకి సామగ్రిని చేర్చుకుంటున్నారు. గోదావరి ఉధృతి ఇలాగే కొనసాగితే శనివారం నుంచి అయోధ్యలంక వాసులు కూడా బయటికొచ్చే వీలుండదు. వారు కూడా పడవలను ఆశ్రయించక తప్పదు.

లంక గ్రామాలను చుట్టుముట్టిన గోదావరి వరద

యలమంచిలి: గోదావరి వరద శుక్రవారం మరింత ఉగ్రరూపం దాల్చడంతో కనకాయలంక, పెదలంక, బాడవ, లక్ష్మీపాలెం తదితర గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంకలో అధికార యంత్రాంగం ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పడవలను ఏర్పాటు చేసినా కనకాయలంక నుంచి రాజోలు, అమలాపురం, జగ్గన్నపేట తదితర గ్రామాల్లో చదువుకుంటున్న విద్యార్థులు నిత్యావసర సరుకులు తెచ్చుకునే ప్రజలు భయం భయంగా పడవల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతోపాటు ఆయా గ్రామాల్లోని లంకలు వరద నీటిలో మునగడంతో పశు గ్రాసం కొరత ఏర్పడింది. పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పశువులకు దాణా అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు ఆందోళన చెందొద్దు : తహశీల్దార్

వరద ప్రభావం తీవ్రం కావడంతో శుక్రవారం తహశీల్దార్ పవన్ కుమార్ ఆయా గ్రామాల్లో పర్యటించి శనివారం నాటికి వరద ప్రభావం తగ్గే అవకాశం ఉందని, ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రభుత్వం తరపున ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని తెలిపారు.

ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



వాల్పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి


ప్రజాశక్తి - భీమవరం

మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, స్పేస్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పర్యావరణ అనుకూల వినాయక చవితిపై అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన వాల్పోస్టర్లను, కరపత్రాలను కలెక్టర్ నాగరాణి ఆవిష్కరించి మాట్లాడారు. పర్యావరణ హితం చేసే మట్టి వినాయకులతోనే చవితి జరుపుకోవాలని కోరారు. మట్టి వినాయకులను తయారు చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహజ రంగులతో మట్టి విగ్రహాలను తయారు చేయడం స్వచ్ఛతకు గొప్ప చిహ్నమే గాక ఖర్చులేనిది అని తెలిపారు. జిల్లా కాలుష్య నియంత్రణా మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మట్టి వినాయకులతో పూజించడం, పత్రిని ఉపయోగించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై ఇప్పటికే జిల్లా అంతటా కళా జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పేస్ ఎన్జిఒ ప్రెసిడెంట్ గోపీశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ మావుళ్లమ్మ గుడి వద్ద ఆదివారం బజార్ సోమ, మంగళవారాల్లో మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కాలుష్య నియంత్రణా మండలి, ఎఇ ఎస్.రమేష్, ఎన్.వెంకటరమణ, స్పేస్ ఎన్జిఒ ప్రెసిడెంట్ గోపీశెట్టి మురళీకృష్ణ, జిల్లా అటవీ శాఖ అధికారి ఆశా కిరణ్, జిఎస్డబ్ల్యూఎస్ అధికారి వై.దోసిరెడ్డి, నరసాపురం ఆర్డిఒ దాసిరాజు ఉన్నారు.

తీరప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లాలో తీరప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనపై అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లాస్థాయి కమిటీ ఛైర్మన్ నాగరాణి అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. తీరప్రాంత నియంత్రణ జోన్ ఉల్లంఘనకు సంబంధించి మూడు అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. నరసాపురంలోని వశిష్ట గోదావరి నది ఒడ్డున ఘన వ్యర్థాలు పారేయడంపై నరసాపురం మండలం పీచుపాలెం, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో అక్రమ రొయ్యల చెరువులపై దేవేంద్ర ఫణికర్ ఓసూరి ఫిర్యాదు, మొగల్తూరు మండలం, కెపి.పాలెంసౌత్లో అక్రమంగా ఇసుక తవ్వకం, అనధికార రొయ్యల చెరువు తవ్వకంపై ఎవివి.సత్యనారాయణ (బాబులు) చేసిన ఫిర్యాదులు, పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ నోడల్ అధికారిని నియామకంపై సమీక్షించారు. వశిష్ట వంతెన వరద ఒడ్డున చెత్త డంప్పై స్వచ్ఛభారత్ కింద లెగసీ వేస్ట్ 50 వేల మెట్రిక్ టన్నులను ఇప్పటికే నిర్మూలించినట్లు నరసాపురం మున్సిపల్ కమిషనర్ సమావేశంలో వివరించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీటరు ఎత్తు వరకూ అక్కడున్న మట్టిని మిషనరీతో పెకళించి వ్యర్థాలను పూర్తిస్థాయిలో తీసివేసిన అనంతరం కొత్త మట్టిని నింపి, గ్రీనరీని వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి కె.వెంకటేశ్వరరావు, డిఇ ఎన్.వెంకటరమణ, ఎఇ ఎస్.రమేష్, నరసాపురం ఆర్డిఒ దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, ఇన్ఛార్జి జిఎస్డబ్ల్యూఎస్ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి ఆశా కిరణ్, తహశీల్దార్ ఐతం సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు



మాట్లాడుతున్న కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

బెల్టు షాపులు తొలగించకపోతే ఉద్యమం ఉధృతం

30న ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయ ముట్టడికి పిలుపు

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి గీత వృత్తిని నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగా నరసింహమూర్తి విమర్శించారు. అక్రమ బెల్టు షాపులు తొలగించేంత వరకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా గీత కార్మికుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారుతోందన్నారు. రాజకీయ పార్టీలు కల్లుగీత కార్మికులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారు తప్ప గీతన్నల వృత్తి రక్షణకై, భద్రతకై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం పాలసీ వల్ల గీత వృత్తి నిర్వీర్యం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం గీత కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వృత్తిలో మరణించిన వారికి రూ.5 లక్షలు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆదరణ పథకం పెట్టి దాని ద్వారా ప్రమాదాలను నివారించేలా సేఫ్టీ మోకులు, ద్విచక్ర మోటార్ సైకిల్, గీతన్నల బిడ్డలకు స్వయం ఉపాధి కల్పించేలా వాహనాలు కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గీతన్నల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కార్మికులందరూ మోకులు, ముస్తాబులతో తరలిరావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ అక్రమ మద్యం, బెల్ట్ షాపుల వల్ల వ్యవసాయ కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లిపూడి ఆంజనేయులు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ మాట్లాడుతూ ఒకవైపు కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కుదిస్తున్న పాలకవర్గాలు మరోవైపు కుటుంబాలను పోషించుకునే వృద్ధులను కూడా శాశ్వతంగా నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఐద్వా జిల్లా నాయకులు దేవ జయప్రభ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న కొద్దీ మద్యం పాలసీలను మారుస్తూ వీధికో బెల్ట్ షాపును విచ్చలవిడిగా పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చిన్న వీరభద్రం, సిఐటియు జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొక్కా చంటి, కడల పాండు, జిల్లా సహాయ కార్యదర్శి దాసరి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కాగిత రాధాకృష్ణ, కొండవీటి శ్రీనివాస్, తుంగ సాయిబాబు, బి.సోమేశ్వరరావు, మామిడిశెట్టి నాగభూషణం, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం డివైఇఒగా రామాంజనేయులు



రామాంజనేయులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఇఒలు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం డివైఇఒగా కె.రామాంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో నిడదవోలు ఎంఇఒగా పని చేసి, ఇక్కడకు వచ్చారు. తాజాగా డివైఇఒగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిగూడెం ఎంఇఒలు హనుమ, జ్యోతితోపాటు పలువురు హైస్కూల్ హెచ్ఎంలు రామాంజనేయులుకు శుభాకాంక్షలు తెలిపారు.

రైస్ మిల్లు ఊక ప్రాణాలు తీస్తోంది

సిపిఎం ఆధ్వర్యాన జవహర్‌పేట వాసులు తహశీల్దార్‌కు విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆకివీడు

రైస్ మిల్లుల నుండి వస్తున్న ఊక, దూగర పరిసరాలలోని వారికి ప్రాణాంతకంగా మారుతున్నాయని వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో రైస్ మిల్లులు తిరగనిచ్చేది లేదని తహశీల్దార్ నందూరు వెంకటేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని 14వ వార్డు జవహర్ పేటలోనీ రైస్ మిల్లులు సోమరాజ, జయలక్ష్మి రైస్‌మిల్, రామకృష్ణ మోడ్రన్ రైస్ మిల్లుల నుంచి దుమ్ము, దూగర ఊక విపరీతంగా వచ్చి అక్కడ నివసిస్తున్న వార్డు ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయని సిపిఎం ఆధ్వర్యంలో ఆ ప్రాంత ప్రజలు శుక్రవారం తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఇళ్లలో కాపురం ఉండలేకపోతున్నామని, తలుపు తీస్తే కళ్లల్లోకి వచ్చి పడుతోందని తమ ఆవేదన వెలిబుచ్చారు. ఈ దుమ్ము వలన నివసించడానికి చాలా ఇబ్బందిగా మారిందన్నారు. పిల్లలు, పెద్దలు సైతం దురదలతో కురుపులు పుల్లులా తయారై చాలా బాధపడుతున్నామన్నారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ వెంకటేశ్వరరావు ఆ ప్రాంతానికి తరలివచ్చారు. అక్కడ ఉన్న రైస్ మిల్లులను పర్యవేక్షించి, పరిస్థితిని పరిశీలించారు. వెంటనే ఆ మిల్లులను ఆపేయాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాలను పాటించని మిల్లులను తిరగనిచ్చేది లేదని, మూసివేస్తామని స్థానికులు హెచ్చరించారు.

వైద్యం ఆపేసి.. చంపేస్తారా

కలెక్టరేట్ వద్ద వర్మ ఆసుపత్రి డయాలసిస్ రోగుల ఆందోళన

పట్టణ పౌర సమాఖ్య, కెవిపిఎస్ సంఘీభావం

డయాలసిస్ సేవలు పునరుద్ధరిస్తాం: జెసి రాహుల్ కుమార్ రెడ్డి

వర్మ ఆసుపత్రిలో తప్పు జరిగింది.. అందుకే సేవలు నిలుపుదల చేశాం : డిఎంహెచ్ఒ గీతాబాయి



డయాలసిస్ రోగులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ గీతాబాయి

ప్రజాశక్తి - భీమవరం

కొనఊపిరితో కొట్టుమిట్టాడుతూ జీవిస్తున్నా పట్టించుకోరా.. డయాలసిస్ వైద్యం మధ్యలో ఆపేసి మమ్మల్ని చంపేస్తారా.. మా ప్రాణానికి విలువ లేదా అంటూ డయాలసిస్ రోగులు కంటతడి పెట్టుకున్నారు. భీమవరం వర్మ ఆసుపత్రిలో ఎన్టిఆర్ వైద్య సేవలు నిలుపుదల చేయడంతో గత రెండు రోజుల నుంచి డయాలసిస్ వైద్య సేవలకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి డయాలసిస్ చేయకపోవడంతో శుక్రవారం సుమారు 200 మంది డయాలసిస్ రోగులు భీమవరం కలెక్టరేట్ వద్ద ఆందోళన దిగారు. ప్రతిరోజూ డయాలసిస్ సేవలు అందకపోతే మా ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఉంటుందని తెలిసీ వైద్య సేవలు నిలిపివేడయం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

మా ప్రాణానికి ప్రభుత్వం ఇచ్చిన విలువ ఇంతేనా అని కంటతడి పెట్టారు. కలెక్టరేట్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. డయాలసిస్ రోగుల ఆందోళనకు ఎపి పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు సంఘీభావం తెలిపారు. బాధితులతో కలిసి ఆందోళనలో భాగస్వామ్యమయ్యారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేస్తున్న ప్రాంతానికి గీతాబాయి వచ్చి బాధితులు, నేతలతో మాట్లాడారు. వర్మ ఆసుపత్రి యాజమాన్యం తప్పు చేసిందని అందుకే ఎన్టిఆర్ వైద్య సేవలు పూర్తిగా నిలిపివేశామని చెప్పారు. తణుకు, తాడేపల్లిగూడెంలోని ఆసుపత్రిలోకి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. దీంతో ఆగ్రహించిన రోగులు అవసరమైతే ప్రాణాలు వదులుకుంటామే తప్ప అంతదూరం ప్రయాణం చేయలేమని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో జెసికి సమస్యను విన్నవించారు. అనంతరం అధికారులతో జెసి సంప్రదింపులు జరిపారు. యాజమాన్యంతో మాట్లాడి వైద్య సేవలు పునరుద్ధరిస్తున్నామని హామీ ఇచ్చారు. వెంటనే వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. అయితే పాత రోగులకు మాత్రమే చికిత్స చేసుకునే అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. కొత్త రోగులకు చికిత్స చేయించుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. తాత్కాలికంగా చికిత్స అందిస్తే ఎలా అని మాకు పూర్తిస్థాయి సేవలు కొనసాగించాలని రోగులు కోరారు. దీనిపై పైఅధికారులతో మాట్లాడతానని ప్రస్తుతం ఎవరికీ చికిత్స ఆగదని స్పష్టం చేశారు. జెసి, డిఎంఅండ్‌హెచ్ఒ హామీతో రోగులు ఆందోళన విరమించి చికిత్స నిమిత్తం వర్మ ఆసుపత్రికి తిరిగి వెళ్లారు.

డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

జిల్లా కేంద్రంలో తక్షణం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. అన్ని విధాలా అభివృద్ధి చెందిన జిల్లాగా రాష్ట్రంలోనే పేరుందని గానీ కిడ్నీ రోగులకు వైద్యం అందించే పరిస్థితి జిల్లా కేంద్రంలో లేకపోవడం బాధాకరమని తెలిపారు. జిల్లా కేంద్రంలో కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యులు, డిప్యూటీ స్పీకర్, పిఎసి ఛైర్మన్, శాసన మండలి ఛైర్మన్, ఎంఎల్ఎలు, ముఖ్య ప్రజా ప్రతినిధులున్నా డయాలసిస్ కేంద్రం లేకపోవడం అన్యాయం అన్నారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ఇటీవల కాలంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు తప్ప అమలు చేయలేదన్నారు. ప్రజా ప్రతినిధులు డయాలసిస్ కేంద్రాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ హాస్పటల్ యాజమాన్యం ఏదైనా తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలి గానీ రోగులకు చికిత్స అందకుండా చేయడం అన్యాయమని ప్రశ్నించారు. తక్షణం చికిత్సను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

యూరియాపై సర్కార్ దొంగాట..!



పోలవరం మండలం గూటాలలో బారులు తీరిన రైతులు

సరిపడా నిల్వలు లేకపోయినా ఉన్నట్లు ప్రచారం

రైతుల నెత్తిపై నానో యూరియా రుద్దేందుకు కుట్ర

నానో యూరియా అమ్మకాలపై సహకార సంఘాలకు టార్గెట్లు

యూరియా కోసం సహకార సంఘాల వద్ద రైతుల పడిగాపులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులు వినియోగించే ప్రధాన ఎరువు యూరియాపై ప్రభుత్వం దొంగాట ఆడుతోంది. సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. పోలవరం మండలం గూటాల సహకార సంఘం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్న ఘటనే అందుకు నిదర్శనం. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ యూరియా కోసం రైతుల ఇబ్బందులు రోజురోజుకీ పెరుగుతున్న పరిస్థితి కన్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో నానో యూరియాను రైతులకు అంటగట్టే ఉద్దేశంతోనే ప్రభుత్వం యూరియా కొరత సృష్టిస్తుందని రైతుల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుతోపాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాకు 33,762 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేయగా, పశ్చిమగోదావరి జిల్లాకు 21,270 మెట్రిక్ టన్నులు అవసరమని తేల్చారు. ఏలూరు జిల్లాలో ఆగస్టు నెలకు 10,183 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవ్వగా, గడిచిన 16వ తేదీ నాటికి జిల్లాకు 5,496 మెట్రిక్ టన్నుల యూరియా చేరినట్లు చెబుతున్నారు. యూరియా సరిపడా వస్తుందని అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరినట్లు చెప్పుకొస్తున్నారు. అయితే అధికారులు చెబుతున్న లెక్కలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. యూరియా కోసం రైతులు సహకార సంఘాల వద్ద పడిగాపులు పడితే తప్ప అందని పరిస్థితి నెలకొంది. యూరియాపై ఇచ్చే సబ్సిడీని తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నానో యూరియా అమ్మకాలను పెంచాలని రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొస్తోంది. దీంతో యూరియా విక్రయిస్తున్న సహకార సంఘాలకు ప్రభుత్వం టార్గెట్లు పెట్టింది. సహకార సంఘాల్లో నానో యూరియాను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.

నానో యూరియాతో కలిపి లెక్కలు చెబుతున్నారా..?

ప్రభుత్వం 25 శాతం నానో యూరియా, 75 శాతం యూరియా ఉపయోగిస్తున్నట్లు చెబుతున్నా అందులో నిజం లేకుండాపోయింది. క్షేత్రస్థాయిలో మాత్రం అధికంగా నానో యూరియా అమ్మకాలు చేసేలా వ్యవహారం సాగిస్తోంది. యూరియా కొరత సృష్టించి నానో యూరియాను రైతుల నెత్తిన రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. పోలవరం మండలం గూటాలలో 1600 ఎకరాల వరకూ వ్యవసాయ సాగు ఉంది. రెండో కోటా ఎరువు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ 250 బస్తాల యూరియా మాత్రమే సరఫరా జరిగింది. దీంతో రైతులు యూరియా కోసం బారులు తీరి పడిగాపులు పడుతున్నారు. అధికారులు మాత్రం 650 లీటర్ల నానో యూరియా ఉందని, రైతులకు యూరియా కొరత లేదని చెబుతున్నారు. అంటే నానో యూరియా లెక్కలతో కలిపి యూరియా నిల్వలు సరిపడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది. నానో యూరియా వాడేందుకు రైతులు ముందుకు రావడం లేదు. దీంతో యూరియా సమస్య రోజురోజుకీ తీవ్రతరమవుతోంది. నానో యూరియా వల్ల పెద్దగా ఉపయోగం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. అలాంటప్పుడు బలవంతంగా నానో యూరియాను రైతులకు ఏవిధంగా అంటగడుతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం యూరియా నిల్వలపై దొంగాట ఆడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు సరిపడా యూరియా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

చవితి ఉత్సవాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఎస్పి అద్నాన్ నయీం అస్మి

భీమవరం టౌన్ : సురక్షిత, ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని, మండపాల వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాలకు అనుమతి తీసుకోవడం తప్పనిసరన్నారు. ఈ ప్రక్రియ కోసం https://ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, ఈ వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్, ఓటిపి ద్వారా లాగిన్ అయ్యాక, అవసరమైన అన్ని వివరాలను నింపాలని తెలిపారు. దరఖాస్తును పరిశీలించిన తర్వాత పోలీసులు ఒక క్యూఆర్ కోడ్‌ను జారీ చేస్తారన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను మండపం వద్ద తప్పకుండా అతికించాలని తెలిపారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వైరింగ్‌ను నిపుణులతో చేయించాలని, సౌండ్ సిస్టమ్ లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మతపరమైన ప్రదేశాల వద్ద మైకులను వాడకూడదని తెలిపారు. ఊరేగింపు సమయంలో రెచ్చగొట్టే నినాదాలు, అనుచిత ప్రదర్శనలు, అసభ్యకరమైన నృత్యాలు చేయకూడదని, డిజేలు, బాణసంచాకు అనుమతి లేదని అన్నారు. నిమజ్జనం వాహనాలకు లైసెన్స్ ఉన్న డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని, మద్యం సేవించిన వారు లేదా మైనర్లు వాహనంపై ఉండకూడదని తెలిపారు. నిమజ్జనం మార్గం, సమయం, తేదీ వివరాలను పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు.

మట్టి విగ్రహాలే ఆరోగ్యకరం

భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ జగన్మోహన్ రావు

భీమవరం టౌన్ : ప్రకృతి సిద్ధమైన, సాంప్రదాయబద్ధమైన మట్టి వినాయక విగ్రహాలతో పూజ ఆరోగ్యకరమని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ కె.జగన్మోహన్ రావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలనే పూజిలంటూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ హెడ్ మాస్టర్ జి.రాజేశ్వరి, జెఇఇ నారాయణ రెడ్డి, సైన్స్ టీచర్ హెచ్.జ్యోతి, జి.సంతోష్ మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో శ్రీగౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ


కె.వెంకట లక్ష్మి


కె.సిరి


పి.చండి సిరి

నరసాపురం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రకటించిన నాలుగవ సెమిస్టర్ ఫలితాలలో శ్రీగౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను మరోకసారి చాటి చెప్పారు. బిఎస్‌సి కంప్యూటర్స్ విభాగంలో కె.సిరి, ఎ.భార్గవి, వై.స్వాతి ప్రియ ఉత్తమ ఫలితాలను కనబరిచారు. బిఎస్‌సి జువాలజీ విభాగంలో కె.వెంకటలక్ష్మి, ఎస్.కావ్య, జి.దీపిక తమను తాము మరొక్కసారి నిరూపించుకున్నారు. బికాం కంప్యూటర్స్ విభాగంలో పి.చండీశ్రీ, డి.లీలా పావని, ఎం.బండి ముత్యాలమ్మ ప్రతిభ పాటవాన్ని కనబరిచారు. ఈ ఫలితాలలో మొత్తంగా బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ విభాగంలో 98 శాతం, బిఎస్‌సి జువాలజీ విభాగంలో 99 శాతం, బిఎస్‌సి బాటనీ విభాగంలో 100 శాతం, బీకాం కంప్యూటర్స్ విభాగంలో 96 శాతం ఫలితాలను విద్యార్థులు సాధించారు. కళాశాల డైరెక్టర్, కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ పత్రి శ్రీనివాస్, కళాశాల సూపరింటెండెంట్ సత్యనారాయణ అభినందించారు.

టీటీ ఇంజక్షన్లు తప్పనిసరి

ప్రజాశక్తి - ఉండి

16 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థికి టీటీ ఇంజక్షన్లు తప్పనిసరి అని ఉండి పిహెచ్‌సి పబ్లిక్ హెల్త్ నర్స్ హెప్సీ కుమారి అన్నారు. శుక్రవారం ఉండి ఐటిఐ కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి కళాశాలలో చదివే సుమారు 70 మంది విద్యార్థులకు టీటీ ఇంజక్షన్ ఇవ్వడం జరిగిందని హెప్సీకుమారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి టీటీ ఇంజక్షన్ చేయించుకోవడం మంచిదని, దీనివల్ల ఏదైనా గాయాలైనప్పుడు ఇన్ఫెక్షన్ సోకకుండా ఉంటుందన్నారు. అదేవిధంగా ధనుర్వాతం రాకుండా రోగ నిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఎఎన్‌వి.లక్ష్మి, ఆశాలు శ్యామల, సువార్త, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ఐదు, పది, పదహారు వయస్సు కలిగిన పిల్లలకు టీకాలు వేయించాలని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. మల్లిపూడి మోడల్ ప్రైమరీ స్కూల్లో శుక్రవారం మల్లిపూడి ఆరోగ్య ఉపకేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.రంగనాథ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో శుక్రవారం టిబి ముక్తి భారత్ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షులు నిక్షయ మిత్ర డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు, రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో 20 మందికి టిబి మందులు వాడుతున్న వారికి పోషకాహారం కిట్లు అందజేశారు. రోటరీ కార్యదర్శి పోతబత్తులు సత్యనారాయణ, ట్రెజరర్ గన్నబత్తుల శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025

నరసాపురం : ఉన్నత విద్యామండలి ఆధ్వర్యాన స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్-2025లో భాగంగా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గురువారం, శుక్రవారం ఆన్‌లైన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. గోవా బిట్స్ పిలాని ఆచార్యులు ఇంద్రాక్షిరాయ్ చౌదరి, అటల్ ఇంకుబేషన్ సెంటర్ సిఇఒ డాక్టర్ చంద్రమౌళి క్వాంటం కంప్యూటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ పోటీలకు 30 బృందాలను ఎంపిక చేశారు. విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టులను కమిటీ పరిశీలించి రెండు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి సెమీ ఫైనల్‌కు ఎంపిక చేస్తుందని కార్యక్రమ సమన్వయ కర్త, ఎఐ విభాగాధిపతి డాక్టర్ బొమ్మ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కెవి.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపిచంద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

మానవత సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు

ప్రజాశక్తి - ఉండి


మాట్లాడుతున్న డాక్టర్ రంగరాజు

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఉండి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కలిసిపూడిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మెయిన్ స్కూల్లో జరిపారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కోఆర్డినేటర్ దంగేటి రామలింగేశ్వరరావు, కోశాధికారి కట్రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సేవ చేయాలనే మానవత సేవా సంస్థ రామచంద్ర రెడ్డి ఆశయం మేరకు ఐదేళ్లుగా మానవత సభ్యులు తయారవ్వాలన్నారు. దాత వేంద్ర రాజేశ్వరి(ఏలూరు)కు సంస్థ తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పెన్మెత్స రంగప్రసాదరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోగులమండ ఎలీషా, కొత్తపల్లి రవివర్మ, నాగరాజు, ఏసురాజు, గ్రామస్తులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, మానవత సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

గణపవరం : మండలంలోని జల్లికొకినాడ మండలపరిషత్ ఒకటవ పాఠశాలలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పివిఆర్.సుబ్రహ్మణ్యం, ఎస్.సంజీవరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాటం చేయడమే కాకుండా విద్యార్థుల విద్యాభివృద్ధికి సిపిఎం కృషిచేస్తున్నట్లు చెప్పారు. బంటుమల్లిజార్జి, దొడ్ల వెంకటరత్నం, చిన గంగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : డిఎస్‌పి

నరసాపురం : వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆయా నిర్వాహకులకు పోలీస్ సూచనలు జారీ చేశారు. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఎటువంటి ఫీజులు చెల్లించక్కర్లేదన్నారు. కేవలం అనుమతులు తీసుకుంటే సరిపోతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా సులభంగా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. చవితి ఉత్సవాలు శాంతియుతంగా, ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించాలని ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద కోరారు.

డిఆర్‌ఒ వెంకటేశ్వర్లుకి అభినందన

భీమవరం : జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న మొగిలి వెంకటేశ్వర్లును ఐఎఎస్‌గా నిర్ధారిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీచేసిన నేపథ్యంలో పలువురు అభినందనలు తెలియజేశారు. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ వెంకటేశ్వర్లును నరసాపురం డివిజన్ గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.రమణ, ఉండి అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎస్.మాధవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన

యలమంచిలి : మండలంలోని దొడ్డిపట్ల హైస్కూల్లో గురువారం బాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, పోక్సో యాక్ట్ 2012పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్ మామత్రి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక, మంచి నైతిక విలువలను పెంపొందించుకుని చదువు పట్ల శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్‌వి మల్లీశ్వరి, డిసిపియు అవుట్ రీచ్ వర్కర్ కె.స్వర్ణలత, హెచ్ఎం ఆర్.సత్యనారాయణ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ రేణుక, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల బాటలో పయనిద్దాం

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఆచంట



దిగుపాటి ప్రకాశరావు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

తమ కోసం తాముగా అనేక మంది జీవిస్తుంటారు కానీ ప్రజల కోసం తమ విలువైన ప్రాణాలు సైతం అర్పించేవారు అతి తక్కువ మందే ఉంటారని అటువంటి వారిలో అమరవీరులు ప్రేరేప మృత్యుంజయుడు, తాళ్ల బసవ మల్లయ్య అగ్రగన్యులని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. అమరవీరుల వర్ధంతి వేడుకలు శుక్రవారం ఆచంట కచేరి సెంటర్లో మండల కార్యదర్శి పి.మోహన్ రావు అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రేరేప మృత్యుంజయు, తాళ్ల బసవ మల్లయ్యలు, అమరజీవులు దిగుపాటి ప్రకాశరావు, నెక్కంటి రామదాసు చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా దిగుపాటి ప్రకాష్‌రావు స్థూపం వద్ద ఉన్న జెండాను సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఆచంట కచేరి సెంటర్లో మృత్యుంజయుడు స్థూపం వద్ద జెండాను సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులు ఇటువంటి నిష్కళంక, నిస్వార్థ ప్రజా నాయకులను మరెందర్నో తుపాకీ గుళ్లకు బలిచేందని ఆవేదన వ్యక్తం చేశారు. అమర జీవుల బాటలోనే దిగుపాటి ప్రకాష్ రావు, నెక్కంటి రామదాసు వంటి త్యాగజీవులందరూ ఆచంటలో తుది శ్వాస విడిచే వరకు పనిచేశారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ త్యాగజీవుల ప్రజా పోరాటాల చరిత్రను పునర్వాలోకనం చేసుకొని వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లవలసిన ఆవశ్యకత, బాధ్యత, కర్తవ్యం మనందరిపై ఉందన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో అమరవీరులు, త్యాగజీవుల వారసత్వం పుణికి పుచ్చుకుని సిపిఎం స్వచ్ఛమైన రాజకీయాలను, ప్రజాప్రేరకమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ విద్యా, వైద్యంతో పాటు ప్రభుత్వ సంస్థలు సేవా రంగాలన్నిటిని ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు విచ్చలవిడిగా ధారాధత్తం చేస్తూ ప్రజల ఆస్తులను, ప్రభుత్వ వ్యవస్థలను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. మండలంలో అమరవీరుల పోరాట స్ఫూర్తితో అనేక ప్రజా సంస్థలపై ఐక్యంగా పోరాడి విజయాలు సాధించామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతగోపాలన్, మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లబ్బాయి, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే, బండి రంగారావు, నెక్కంటి కృష్ణమూర్తి, గుత్తుల రంగారావు, కొండేటి సత్యనారాయణ, కొండేటి రాఘవులు, వెంకట్రావు, సిర్రా నరసింహమూర్తి, రాపాక సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, సిర్రా విగ్నేశ్వరుడు, మానుకొండ వీర్రాజు పాల్గొన్నారు.

గణేష్ ముక్తేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంఎల్‌ఎ

నరసాపురం : నరసాపురం సూర్య విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి గణేష్ ముక్తేశ్వరరావు వేములదీవి ప్రాంతంలోని చిన్నలంకలో నీటి ప్రమాదంలో ఇటీవల మృతిచెందారు. గణేష్ ముక్తేశ్వరావు తండ్రి కృష్ణారావు లేరు. తల్లి సమోసా వ్యాపారంతో కుటుంబ పోషణ చేసుకుంటుంది. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, మేనేజ్మెంట్ వారు గణేష్ ముక్తేశ్వరరావుకు గుర్తుగా వారి కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలిచి సుమారు రూ.70 వేలు సేకరించి ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా తల్లి కుమారికి అందజేశారు. విద్యార్థులలో ఇటువంటి సేవా కార్యక్రమం ఉండడం ఎంతో అభినందనీయ విషయమని నాయకర్ అన్నారు. గణేష్ ముక్తేశ్వరరావు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సూర్య విద్యాసంస్థల కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బ్రహ్మాజీ మాట్లాడుతూ కళాశాల స్థాయి నుండి సేవా కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడం, తోటి వారికి సహాయ పడాలని ఆలోచనతో ముందుకెళ్లడం విద్యార్థి దశలోనే అలవర్చుకోవడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నగదు సాయం చేస్తున్న సభ్యులు

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ మేక శ్రీరామ్ సురేష్

మొగల్తూరు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ మేక శ్రీరామ్ సురేష్ సూచించారు. లయన్స్ క్లబ్ మొగల్తూరు శాఖ నూతన కార్యవర్గం గురువారం రాత్రి స్థానిక వివేక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రమాణ స్వీకారం చేశారు. మొగల్తూరు శాఖ అధ్యక్షులుగా ఉండపల్లి గీత షారోన్ పుష్ప, కార్యదర్శిగా తణుకుల రామకృష్ణ, కోశాధికారిగా గుమ్మళ్ల రవిబాబు, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు షారోన్ పుష్ప, రామకృష్ణ మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యాన సేవలు విస్తృతం చేస్తామన్నారు. క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా రామన్నపాలెం పంచాయతీ పిప్పళ్ల వారితోటకు చెందిన కిడ్నీ బాధితుడు కడిమి నాగేశ్వరరావుకు రూ.20 వేల నగదును క్లబ్ సభ్యులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌విఎస్.పాపారావు నాయుడు, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.సూర్యనారాయణ రాజు, ఉండపల్లి రాంబాబు, సిహెచ్.శ్రీనివాసరాజు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలి

పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

సిపిఎం జిల్లా శిక్షణా తరగతుల్లో రాష్ట్ర నాయకులు సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు పేదలకు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారి తోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మతం మతోన్మాదంపై సిపిఎం కార్యకర్తలకు బోధించారు. మోడీ ప్రభుత్వం మత విశ్వాసాలను దెబ్బతీస్తూ ప్రజల్ని విభజించి పాలిస్తుందని, ఈ విధానాలు తిప్పుకొట్టాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం రూ.200 లక్షల కోట్ల అప్పులు చేసి కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని, అధిక ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలమైన పేదలకు ఇంతవరకు స్థలాలు కేటాయించలేదని తెలిపారు. ఇంటి అద్దెలు చెల్లించలేక పేదలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్.బాబురావు, బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలతోనే యువ సాధికారిత సాధ్యం

ఎపి నిట్ డీన్ వీరేశ్ కుమార్

తాడేపల్లిగూడెం : సాంకేతిక నైపుణ్యాలతోనే యువత సాధికారిత సాధ్యమని ఎపి నిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ జిబి.వీరేశ్ కుమార్ సూచించారు. ఫోర్జ్ అలుమినస్ ఆధ్వర్యంలో ఎపి నిట్, శశి ఇంజినీరింగ్ కళాశాల భాగస్వామ్యంతో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఫోర్జ్ ఇన్‌స్పైర్ ఎ కెరీర్ అండ్ కార్పొరేట్ ఫెస్ట్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరేశ్ కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆధునిక, సాంకేతిక రంగంలో సమకాలీన, సృజనాత్మక ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టిసారించాలని వివరించారు. మెర్సిడెస్ బెంజ్ కంపెనీ సీనియర్ ఇంజినీర్(బెంగళూర్) అయ్యర్ భట్టాచార్య మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. టి హబ్ డైరెక్టర్(హైదరాబాద్) అవినాష్ కేదార్, ఫ్యూజీ టెక్ ఉపాధ్యక్షుడు (హైదరాబాద్) చాణిక్య వేలాది, ట్రైనింగ్ ప్లేస్ మెంట్ సెల్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి.శంకర్, ఫోర్జ్ అలుమినస్ కంపెనీ ప్రతినిధి రేణికుంట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రయివేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు, కృత్రిమ మేధ పనితీరు, కోడింగ్ సవాళ్లు, సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ ఇంజినీరింగ్ వంటి అంశాల గురించి వివరించారు. మొదటి రోజు హ్యాకథాన్ నిర్వహించగా, రెండో రోజైన శనివారం ప్రాజెక్టు ఎక్స్ పో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో 23 కంపెనీల ప్రతినిధులు, ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యాక్ట్‌ను పునరుద్ధరించాలని వినతి

తణుకు : మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి మాత్రమే పరిమితమైన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్టు పునరుద్ధరించాలని మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఎం.రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జాతీయ కమిటీ(ఎఫ్ఎంఆర్ఎఐ) పిలుపు మేరకు ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ తణుకు శాఖ ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహశీల్దార్‌కు వినతి అందజేశారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కి నిర్దిష్టమైన పని విధానాన్ని అమలు చేయాలని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, శ్రీహర్ష, మోహన్ పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

పాలకొల్లు : పాలకొల్లు యునైటెడ్ కాపు వనితా క్లబ్ ఆధ్వర్యాన విశ్వ మానవ వేదిక వృద్ధాశ్రమంలో 20 మంది వృద్ధులకు శుక్రవారం పంచె, టవల్స్, స్వీట్స్, పండ్లు పంచి పెట్టారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు కావలి మౌని, కటికీ అర్చన, తోట గాయత్రి, యమునా విజయ లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు

ప్రజాశక్తి - కాళ్ల


పెనుమంట్రలో ప్రోటీన్ పౌడర్ అందజేస్తున్న అభిమానులు

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను దొడ్డనపూడి గ్రామంలో భాస్విని చారిటబుల్ ట్రస్ట్ అధినేత, దొడ్డనపూడి సర్పంచి కొల్లి సుబ్బారావు సహకారంతో హెూప్ చారిటబుల్ ట్రస్ట్, ఆనందా బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మెగా పవర్ స్టార్ అభిమానులు హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అరేటి వెంకట రత్నప్రసాద్, మాజీ ఎంపిటిసి కందుల పాటి వీర రాఘవులు పాల్గొన్నారు. అభిమానులు ఘనంగా నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన పేద వికలాంగ వృద్ధురాలు గుబ్బల కాశమ్మకు బియ్యం, దుస్తులు, నిత్యావసర వస్తువులు, కొంత నగదును చిరంజీవి యువత అందజేశారు. మాజీ ఎంపిటిసి గుబ్బల సత్యనారాయణ మూర్తి, ఖండవల్లి అనంత కృష్ణమాచార్యులు, సాయి, చేబ్రోలు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నరసాపురం: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ కేక్ కట్ చేసి అభిమానులతో పంచుకున్నారు. ఈ వేడుకల్లో జక్కం బాబ్జి, పోలిశెట్టి శ్రీనివాస్, కోటిపల్లి సురేష్, కోపల్లి శ్రీనివాస్, దేశినీడి గంగాధర్ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు మాట్లాడుతూ క్లబ్ జిల్లా గవర్నర్ వి.కిషోర్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కె.సత్యనారాయణ మూర్తి, బూసాల బాలాజీ పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని జుత్తిగలో ఉన్న శ్రీసంధ్య జ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి, కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని జనసేన నాయకులు, మెగాస్టార్ అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆచంట నియోజకవర్గ ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తనయుడు వెంకట సురేష్ హాజరై వృద్ధులతో కలసి మాట్లాడారు.

జనసేన ఆధ్వర్యాన మార్టేరు పిహెచ్‌సి ప్రాంగణంలో సుమారు వంద మంది గర్భిణులకు బాలవర్ధక ప్రోటీన్ పౌడర్ డబ్బాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలగలేరు సొసైటీ ఛైర్మన్ బొక్కా నాగేశ్వరరావు, మహిళా సంఘం అధ్యక్షులు సీతా వెంకట నాగ లక్ష్మి, మీరా రెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని పెద మామిడిపల్లి గ్రామంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం మండలంలోని చిట్టవరం గ్రామంలో స్థానిక అంజనాపుత్ర చిరంజీవి యువసేన ఆధ్వర్యంలో గ్రామంలోని మదన గోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జక్కం బాబ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు, చిన్నారులకు పంచారు. అభిమానులు కోపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సత్తిబాబు, కొప్పిరెడ్డి హరిబాబు పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు పురస్కరించుకుని

మొగల్తూరు : తన నటనతో ప్రజలను మెప్పించి స్వయంకృషితో మెగాస్టార్‌గా కొణిదెల చిరంజీవి సినీ ప్రస్థానంలో తనకంటూ కొన్ని పేజీలు లికించుకున్నారని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరు ముద్దుబిడ్డ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను మొగల్తూరులోని పాతకాలవ సెంటర్ చిరంజీవి గ్రంథాలయాల వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, గుబ్బల నాగరాజు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలో ఉన్న వివిధ రకాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ రెవెన్యూ అధికారులను కోరింది. ఈమేరకు శుక్రవారం పట్టణంలో తమ సమస్యలు పరిష్కరించాలని ఊరేగింపుగా తహశీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి సంబంధిత విఆర్ఒకు పట్టణ కార్యదర్శి తేజ వినతిపత్రం సమర్పించారు. మండలంలోని దగ్గులూరులో నిలిచిపోయిన మెడికల్ కాలేజీ పనులు పున్ణ ప్రారంభించాలని కోరారు.

బార్‌ల దరఖాస్తు నియమాలు సడలింపు : ఎక్సైజ్ సిఐ

తాడేపల్లిగూడెం : బార్ లైసెన్సులు పొందేందుకు ఇవ్వబడిన నియమాలలో ప్రతీ బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలని, అలా రాకుండా ఉంటే ఆ బార్‌కు లాటరీ తీయబడదనే నియమం ఉందని ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆ నియమం వల్ల ఒకవేళ ఏదైనా ఒక బార్‌కు నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే దరఖాస్తుదారులకు వారు కట్టిన దరఖాస్తు రుసుము ఐదు లక్షలు తిరిగి చెల్లింపబడతాయని శుక్రవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, ఆంధ్రప్రదేశ్, మంగళగిరి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఎవరైనా దరఖాస్తుదారులు నాలుగు దరఖాస్తులు వస్తాయో రావో నాలుగు దరఖాస్తులు రాకపోతే వారు చెల్లించిన సొమ్ము ఏమవుతుందనే ఆందోళన అవసరం లేదని తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, కలవపూడి గ్రామం, డోర్‌నెం.4-94/1కి చెందిన వేటుకూరి గణపతిరాజు, S/o.శివరామరాజు అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.N9886575 ది.10-08-2025 తేదీన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును ఒక కవరులో పెట్టుకొని నా గ్రామం అయిన కలవపూడి నుండి కాళ్ళ జిరాక్స్ సెంటర్‌కు పాస్‌పోర్టు జిరాక్స్ తీయించు నిమిత్తం నా యొక్క మోటారు సైకిల్ పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

వేటుకూరి గణపతిరాజు, శివరామరాజు
డోర్‌నెం.4-94/1, కవలపూడి, కాళ్ళ మండలం,
ప.గో.జిల్లా. సెల్: 9948234467

ఒరిజనల్ దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, కలటూరు శివారు తట్ర గ్రామ కాపురస్తులు గంపా నాగభూషణం మైనర్ గార్డియన్‌గా గంపా ప్రమీలా రాణి పేరున వున్న ఆగిరిపల్లి మండలం, కృష్ణవరం రెవిన్యూ గ్రామ ఆర్.యస్.నెం.120/4రు దాఖలా య.0.62 సెంట్లు వ్యవసాయ భూమికి సంబంధించిన ఒరిజనల్ దస్తావేజు (నెం.2963/2005) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

కోగంటి బ్రహ్మేశ్వరరావు,
(తండ్రి) సుబ్బారావు
కలటూరు గ్రామం, ఆగిరిపల్లి మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 99598 44545

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

ఆర్.ఓ.సి.నెం.20/2023/ఇ1 **తేది.22.08.2025**

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు Purchase tender నోటీసు ద్వారా పిలువబడుచున్నది.

వ.నెం.	పని వివరము
1.	జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పరిధిలో గల 29 వార్డుల నందు శానిటేషన్ విభాగమునకు అవసరమైన బైటెక్స్, ఆయిల్ బల్స్, కలుపుమందు, ముగ్గు మరియు బ్లీచింగ్ మొదలగు వాటిని Purchase tender టెండరు ద్వారా కొనుగోలు చేయుటకు కొటేషన్లు కోరడమైనది.

కొటేషన్లు స్వీకరించుటకు ప్రారంభపు తేది : 23-08-2025 ఉదయం 10.00 గం కొటేషన్లు స్వీకరించుటకు ఆఖరు తేది : 29-08-2025 సాయంత్రము 4.00 గం

సదరు వర్క్‌కు సంబంధిత ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనర్, జంగారెడ్డిగూడెం, మున్సిపాలిటీ

దావా సమను

మహారాజశ్రీ IIIవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), ఏలూరు, ఏలూరు జిల్లా.

O.S.No.457/2021

బిట్వీన్ :
గొట్టుపల్లి సత్యనారాయణ ...వాది
మరియు
వాసంశెట్టి రాఘవేంద్ర ఆంజనేయులు ...ప్రతివాది

To.
వాసంశెట్టి రాఘవేంద్ర ఆంజనేయులు,
S/o.గోవిందరాజులు, గవర్నమెంటు ఉద్యోగి,
డోర్‌నెం.8-2/2, కామయ్యపేట,
చిన్నరంగనిపాలెం, భీమవరం, ప.గో.జిల్లా.

పై దావాలో ప్రామిసరీ నోటీసు బాకీ పరిహార నిమిత్తం మీ మీదా దావా దాఖలు చేసియున్నందు వలన, మీరు స్వతహాగా గాని సంజాయిషీ పొందిన ప్లీడరు ద్వారా గాని, సదరు దావాలో మీ యొక్క వాదనలను దాఖలు చేసికొనుటకు **తేది.25-9-25వ తారీఖున ఉదయం 10.00 గం॥లకు** హాజరు కాగలరని లేని పరిస్థితులలో మీకు పరోక్షముగా తీర్మానించుట జరుగును.

By Court Order
L.D.L.ACHARI, B.A., B.L.
Advocate
Dt.20-8-25 Eluru.

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో..

ఒ.ఎస్.నెం.98/2024

బిట్వీన్
కాళ్ళ కుశల్ కార్తికేయ
మైనర్ అయినందున గార్డియన్ తల్లి - శ్రీమతి కాళ్ళ మాధవి ...వాది
మరియు
కాళ్ళ వీరవెంకట సత్య ఆది వరప్రసాద్ మరియు యితరులు ...ప్రతివాది

టు
కాళ్ళ వీరవెంకట సత్య ఆది వరప్రసాద్,
S/o.ఆదినారాయణ, వ్యాపారం, కేరాఫ్ :
డోరునెం.24బి-4-62, శ్రీ వెంకట పద్మ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, సుబ్బమ్మదేవి స్కూల్ రోడ్డు, రామచంద్ర రావుపేట, ఏలూరు-533002, ఏలూరు జిల్లా.

యిందు పై నెంబరు దావా గ్రంథములో వాది మీపై ఆస్థి పంచమని దావా దాఖలు చేసినందున మీకు పంపిన నోటీసులు అందుకొనక, కాలయాపన చేయుచున్నందున కోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా యివ్వవలసినదిగా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. మహారాజశ్రీ కోర్టు వారు మీ తరపు వాదనలు /ఆక్షేపణలు నిమిత్తం మీకు ఎన్నిసార్లు దావా నోటీసులు జారీ చేసిననూ అమలు కానందున మహారాజశ్రీ కోర్టు వారు నోటీసు నిమిత్తం ది.03-09-2025వ తేదీకి ఉదయం 10.30 నిమిషములకు వాయిదా వేసియున్నారు. కావున పై తెలిపిన గ్రంథములో ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి యెదుట పై కోర్టు వారి యెదుట హాజరు అయి, మీ యొక్క వాదనలు, ఆక్షేపణలు తెలుపు కొనవచ్చును. లేనియెడల కోర్టు వారి మీ పరోక్షమున కేసును విచారించగలరని తెలియపర్చడమైనది.

సంపర రామచంద్రరావు
అడ్వకేట్, సాయిబాబా గుడి ఎదురుగా,
ఏలూరు నరసింహారావుపేట, ఏలూరు.
తేది:12-08-2025 సెల్: 9440602536

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ELURU (SENIOR DIVISION)

Creditor I.P.19/2025

Between:
Sri Allu Venkata Satya Kesava Madhu babu and Others ...Petitioner 1,2,3
Vs
Smt.Shaik Nurjahan and Others ...Respondents

Resondents :
1.Smt.Shaik Nurjahan, W/o.Shaik Subhani, D.No.17-3-20, Opposite to Prasanthi Kumari Hospital, Adivarapupeta, 48th Division, Eluru, Eluru District.
2.Sri Shaik Subhani, S/o.Shaik Amarin, D.No.17-3-20, Opposite to Prasanthi Kumari Hospital, Adivarapupeta, 48th Division, Eluru, Eluru District.
3.Sri Muggulla Kumar Soma Sai, S/o.Srinivasa Rao, R/o.D.No.20B-10-6, Kanakanala Vari Veedhi, Power Peta, Eluru, Eluru District.
4.The Branch Manager, Canara Bank, Specialized SME Branch, #23A-3-87, Near Swaraj Hotel, Ramachandra Rao peta, Eluru - 534002.
6.Sri. Nalla Srinivasa Rao, S/o.Rangaiah, R/o.H.No.2-51/B, Ponukumaadu, Krishna District.
7.Sri Marrapu Niranjan Kumar, S/o.Ranga Rao, R/o.D.No.20e-14-37, Kothapeta, Yetigattu Center, Eluru, Eluru District.
8.Sri Kalivireddy Prasad, S/o.Surya Rao, R/o.H.No.37-232, Ambedkar Marg Road, Jagathgirigutta, Balanagar, K.V.Rangareddy District, Hyderabad, Telangana State.
9.Sri Guna Venkata Satyanarayana, S/o.Apparao, R/o.D.No.20B-9-18/1, 12 Tap Center, Gandhi Nagar, Eluru, Eluru District.
Respondents R1 to R4, R6 to R9

పై నెంబరు గ్రంథములోని Petitioners 1,2,3 దాఖలు చేసిన Creditor IP లో R1 to R4 మరియు R6 to R9 ప్రతివాదులకు మరియు ఇతరులకు ఎవరికైన ఈ దిగువ 'A' షెడ్యూలు ఆస్తి ది.14-2-2025వ తేదీన DCNo.1378/25, Dt.17-3-2025 DCNo.2352/25, SRO Eluru లో Register చేసిన Sale deed మరియు Mortgage Deed Cancel చేసి సదరు ఆస్తిని Official Receiver (OR) Eluru వారు Hand Over చేసుకుని సదరు ఆస్తి వేలము వేసి 'B' షెడ్యూలు ప్రకారము వారి బాకీని తీర్చమని కోరుచూ దాఖలు చేసిన పై నెంబర్ I.P లో ది.4-9-2025వ తేదీన పై కోర్టు వారు ఎదుట ఉదయం 10.30 ని॥లకు మీరు గాని అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల పరోక్షంగా Order pass చెయ్యబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

A-SCHEDULE PROPERTY FILED BY THE PETITIONERS

West Godavari District, Eluru, Sub-Register. Eluru Mandal, Eluru Coporation, Adivarapupeta, Block No.6/B, Municipal 'D' Ward, Division No.48, Old **T.S.No.1183,** New **T.S.No.1190,** Part-Extent 166-4-0 Square yards of site with the two floor building situated there in bearing door No.17-3-20.

Plot No.1 : Extent 109-7-0 Sq Yards of site with the building situated there in, bounded by :
East : Municipal road. **South :** Site with construction thre in belonging to javid Ahmad. **West :** Joint wall for the schedule property and that of Yajaj Ahmad. **North:** Plot No.2 here in.

Plot No.2: Extent 56-6-0 Sq. yards of site bounded by :
East : Municipal Road. **South :** Plot No.1 here in and the property of Ajaj Ahmad. **West :** Joint wall for the schedule property and that of Yajaj Ahmad. **North:** Site belonging to Setti Nagaraju. With in the above Plot No.1&2 the Total 166-4-0 sq yards with the building situated there in. Approximate market value of the property is Rs.2,00,00,000/-

P.B.Narsimha Murthy
Advocate, Eluru
Cell: 98481 43125